## రైల్వే స్టేషన్‌లో బ్యాగు కలకలం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 4(ఆంధ్రజ్యోతి): బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో ఓ బ్యాగు కలకలం రేపింది. బేగంపేట్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1పై ఓ పక్కన అనుమానాస్పదస్థితిలో బ్యాగు ఉందని ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి వెళ్లి బ్యాగును పరిశీలించగా, అందులో పెళ్లి దుస్తులు, పిల్లల దుస్తులు ఉండడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కాసేపటి తరువాత బ్యాగు కోసం వాకబు చేస్తున్న లింగంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి కనిపించడంతో ఆ బ్యాగును అతడికి అప్పగించారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ బ్యాగులు వదిలేయకూడదని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

## ఇద్దరు చోరుల అరెస్ట్

బోయినపల్లి: చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్య బస్తీ హస్మత్‌పేట్‌కు చెందిన రంజిత్‌సింగ్ (24), చిత్తారి భరత్(20) తన సోదరుడు శ్రీను కలిసి నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ వారి వస్తువులను చోరీ చేసి తప్పించుకు తిరుగుతున్నారు. శనివారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్టు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్ తెలిపారు. రంజిత్‌సింగ్‌పై 15 కేసులున్నాయి. నిందితులను కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు.

# వాగ్దానాలను విస్మరించిన కాంగ్రెస్

- సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రజారంజకమైన పరిపాలనను అందించడంలో విఫలమైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాలను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్‌కు పార్లమెంట్‌లో చోటుకల్పించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాపూజీనగర్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల్లో పద్మారావుగౌడ్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, తదితర నాయకులతో కలిసి పద్మారావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకత్వం వివిధ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, వాటి అమలును విస్మరించారని ఆరోపించారు. బీజేపీ నాయకులు మతతత్వ రాజకీయాలతో ప్రజలను విభజిస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు పార్టీలను ప్రజలు ఎన్నికల్లో తిప్పికొట్టాలని, తనను సికింద్రాబాద్ ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవలందిస్తానని హామీ ఇచ్చారు. ముఠాగోపాల్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

### మైనారిటీలను మోసం చేసింది కాంగ్రెస్సే

- జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్: మైనారిటీలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంట్ ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వరనగర్ కాలనీ, బంజారాహిల్స్ డివిజన్‌ల బూత్ స్థాయి సమావేశంలో ఆయనతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా మైనారిటీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని మాగంటి గోపీనాథ్ అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మరావుగౌడ్‌ను గెలిపించాలని ఆయన కోరారు.

# కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం

- బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి



బంజారాహిల్స్, మే 4(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి అన్నారు. కేంద్రంలో మోదీ పాలన, రాష్ట్రంలో కిషన్ రెడ్డి చేపట్టిన పనులే విజయానికి సోపానాలు అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి హోదాలో కిషన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయలేదని విపక్షాలు ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రాష్ట్రంలో రెండు పార్టీల అసమర్థత పాలన కారణంగా మంచినీటి సమస్య తలెత్తిందని అయితే ముందుచూపుగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలోని 89 పవర్‌బోర్ వెల్‌లు వేయడంతో ఇప్పుడు ఆయా ప్రాంతాలు దాహార్తి నుంచి ఉపశమనం పొందుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లను ఆధునీకరించడంతో పాటు, అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ఓటమి భయంతో ప్రత్యర్థులు కిషన్‌రెడ్డి, బీజేపీని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడం రాజకీయ లబ్ధి కోసమేనని ఆమె అన్నారు. ఎవరెన్ని చెప్పినా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు ఖాయమన్నారు.

### 'బీజేపీకి మద్దతు ఇవ్వండి'

ఖైరతబాద్: బీజేపీ పిలుపు మేరకు శనివారం జుగ్గి-జోపిడి కార్యక్రమంలో భాగంగా గుడెసె వాసులను సంప్రదించి బీజేపీకి మద్దతు తెలపాలని ఖైరతాబాద్ బీజేపీ నేతలు మానేకార్ చంద్రుబాబా, వైద్యనాథ్ కోరారు.


వెంకటేశ్వరనగర్‌కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ తదితరులు


దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ యాదవ్, జ్యోతి తదితరులు

# కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఖైరతాబాద్‌లో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. సికింద్రాబాద్ గతంలో కాంగ్రెస్ కంచుకోటగా ఉండేదని, ఆ స్థానాన్ని తిరిగీ దక్కించుకునేందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని, అలాంటి వారికి ఓటు వేసి మోసపోవద్దని హెచ్చరించారు. అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ విజయం ఖాయం

ముషీరాబాద్: అన్నివర్గాల ప్రజల అండదండలతో సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, మాజీ వార్డుమెంబర్ జ్యోతితో పాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం నాగేందర్ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన మాదిరిగానే కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోపాటు రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక గుర్తింపుతోపాటు పదవులు లభిస్తాయన్నారు. అనంతరం ముషీరాబాద్‌లో చేపడుతున్న ప్రచార కార్యక్రమాల వివరాలను బిజ్జి శత్రు దానం నాగేందర్‌కు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### 'దానంను గెలిపించాలి'

వెంగళరావునగర్: కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త రేగులపాటి రమ్యారావు అన్నారు. శనివారం మధురానగర్ కాలనీలో పార్టీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆమె సూచించారు. సమావేశంలో పార్టీ ఇన్‌చార్జి బి.సూరి, సీనియర్ నాయకుడు వి.నవీన్ యాదవ్, అసదుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న నర్సింగరావు

పంజాగుట్ట: కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని పార్టీ మహిళా నాయకులు శనివారం వెంకటరమణ కాలనీ, పద్మావతినగర్, తదితర బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

### 'కార్యకర్తలు కృషి చేయాలి'

ఎర్రగడ్డ: దానం నాగేందర్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం చైర్మన్ మహమ్మద్ మోహన్ ఖురేషి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో బూత్ కమిటీల వారీగా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎస్ రెడ్డి, కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి డి.రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షుడు కృష్ణకుమార్, నాయకులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ: దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శనివారం యూసుఫ్‌గూడ డివిజన్‌లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ నాయకులు నవీన్‌యాదవ్, తదితరులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

## క్షుద్రపూజల పేరిట డబ్బులు వసూలు

- బాధితుడి ఫిర్యాదుతో అరెస్ట్
- పోలీసు కస్టడీలో నుంచి పరారైన మోసగాడు
- నిందితుడిపై మరో కేసు

బంజారాహిల్స్, మే 4(ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజల పేరిట లక్షల రూపాయలు వసూలు చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారణలో ఉండగా పోలీసు కస్టడీలో నుంచి నిందితుడు పరారయ్యాడు. అతడిపై మరో కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు-14లో నివాసముంటున్న సుందర్‌రాజ్ కుటుంబానికి కర్నూల్‌కు చెందిన పండిత్‌రాజు అలియాస్ జగ్గుల రాజు పరిచమయ్యాడు. పూజలు చేసి, సమస్యలను తీర్చుతానని సుందర్‌రాజ్ తల్లికి మాయమాటలు చెప్పిన జగ్గుల రాజు గత రెండేళ్లుగా, శాంతి, దోషనివారణ పూజల పేరుతో లక్షలు వసూలు చేశాడు. పూజల ఫలితం లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సుందర్‌రాజ్, పూజల కోసం తీసుకున్న డబ్బులు వెనక్కివ్వాలని పండిత్ రాజ్‌ను నిలదీశాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పండిత్‌రాజ్ మీ కుటుంబంపై క్షుద్రపూజలు చేస్తానంటూ బెదిరించాడు. ఏడాది కాలంగా సుందర్ రాజ్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో జారుకుంది. తన తల్లి ఆరోగ్యం కూడా బాగోలేదు. ఇందుకు పండిత్‌రాజు చేసిన క్షుద్ర పూజలే కారణమని, ఇతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు గత నెల 18న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసుల సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పండిత్ రాజు జాడ గుర్తించిన ఎస్‌ఐ రాంబాబు తన సిబ్బందితో ఈనెల 2న పండిత్‌రాజును అదుపులోకి తీసుకున్నాడు. అతడిని కస్టడీకి తీసుకొని విచారించి అదే రోజు రాత్రి హెడ్ కానిస్టేబుల్ శివరాజ్‌కు అప్పగించాడు. కానీ మరుసటి రోజు ఉదయం పండిత్‌రాజు పోలీస్‌స్టేషన్‌లో కనిపించకపోవడంతో హెడ్ కానిస్టేబుల్ శివరాజ్ ఎస్‌ఐకు సమాచారం ఇచ్చాడు. నిందితుడి కోసం పలు చోట్ల గాలించిన పోలీసులు ఆచూకీ లభించకపోవడంతో మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 20 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు చాముండేశ్వర్‌నాథ్, ప్రధాన కార్యదర్శి కె.వంశీధర్ తెలిపారు. సబ్ జూనియర్(అండర్-13, 15, 17) జూనియర్ (అండర్-19), పురుషులు, మహిళలకు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో హైదరాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 16వ తేదీ లోపు https://btronlin.in/ ఈ వెబ్‌సైట్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. హైటెక్‌సిటీలోని గేమ్ పాయింట్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

## టెన్నిస్ విజేత రామోజు



ఏటీపీ నేషనల్ సిరీస్ అండర్-14 బాలుర విభాగంలో ఎ.శ్రీరామోజు విజేతగా నిలిచాడు. గత నెల 29వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీలు శనివారం ముగిశాయి. సింగిల్స్ ఫైనల్లో శ్రీరామోజు 3-6, 6-0, 6-4తో ఆర్యన్‌పై నెగ్గాడు. బాలికల సింగిల్స్ ఫైనల్లో సృష్టి కిరణ్ 6-0, 7-5తో సుభాణిపై గెలిచింది. బాలుర డబుల్స్‌లో శ్రీరామోజు-మీర్ ఫజల్ అలీ 4-6, 6-3, 10-5తో ఆర్యన్-లక్ష్యవర్దన్‌పై నెగ్గగా, బాలికల డబుల్స్‌లో సృష్టి-పద్మ జోడీ విజేతగా నిలిచింది.

## కాంగ్రెస్ గెలుపుకోసం కృషి : వడ్డెర ఐక్యవేదిక


రేవంత్ రెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక కమిటీ సభ్యులు


సీఎం రేవంత్ రెడ్డి రోడ్ షోకు తరలిపోతున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

యూసుఫ్‌గూడ, మే 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేకు శనివారం కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. వడ్డెరులకు అన్నిరకాలుగా అండగా ఉంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వేముల యాదయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముద్దంగుల శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండే సురేష్, రహ్మత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మేఘన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### రేవంత్‌రెడ్డి రోడ్ షోకు తరలినన నేతలు

అమీర్‌పేట, మే 4(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షోకు అమీర్‌పేట డివిజన్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ ఆదేశాల మేరకు డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో 800మంది అమీర్‌పేట చౌరస్తా నుంచి ర్యాలీగా డీకే రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయానికి చేరుకుని 8వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మధుగౌడ్, ఆరేళ్ల సునీల్, గోదాస్ నవీన్, రజనీకాంత్, జయశ్రీ గౌడ్, దుర్గా ప్రసాద్, ఎస్ఎస్ రెడ్డి, నరేష్ తదతరులు ఉన్నారు.

# హెల్త్‌కేర్ రంగంలో అవకాశాలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఐహెచ్ఎంఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ అన్సారి

పంజాగుట్ట, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హెల్త్ కేర్ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని బెంగళూరులోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రిసెర్చ్ (ఐఐహెచ్ఎంఆర్)అసోసియేట్ ప్రొఫెసర్ శంసుజమాన్ అన్సారీ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య రంగంలో ఉపాధి అవకాశాలు, సంస్థ అందిస్తున్న కోర్సులను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ప్రదీప్ కుమార్‌తో కలిసి రెండు సంవత్సరాల కాల వ్యవధితో నూతనంగా ప్రవేశపెట్టిన పీజీడీఎం ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డాటా సైన్స్ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ రకాల వైరస్ ల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో హెల్త్ వర్కర్ల అవసరం పెరుగుతోందన్నారు. వైద్య రంగంలోని కొరతను తీర్చేందుకు తమ సంస్థ ఎప్పటికప్పుడు నూతన కోర్సులను ప్రవేశపెడుతోందని చెప్పారు. ప్రస్తుతం ఏఐ ఆధారిత కోర్సును ప్రవేశపెట్టినట్టు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సుకు అర్హులన్నారు. రెండు సంవత్సరాల కోర్స్ పూర్తి చేసిన విద్యార్థులకు దేశంలోనే కాక, విదేశాల్లో సైతం మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. కనీస డిగ్రీ విద్యార్హతతో తాము అందిస్తున్న కోర్సులలో శిక్షణ పొందిన వారు దేశంలోని అత్యుత్తమ వైద్య సంస్థల్లో ఉద్యోగాలు పొందారని తెలిపారు. మ్యాట్, క్యాట్ పరీక్షల్లో ఉత్తీర్ణులు అయిన, ఇంటర్వ్యూలో, గ్రూపు డిస్కషన్‌లో ప్రతిభ చూపిన వారికి ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు.

## నిమ్స్‌లో తలసీమియాపై అవగాహన


నిమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 4(ఆంధ్రజ్యోతి): తలసీమియా బాధితులు ఇబ్బందులు, చికిత్స విధానలపై నిమ్స్‌లో శనివారం నిరంతర వైద్య విద్య (సీఎంఈ), అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిమ్స్‌లోని జెనిటిక్స్ విభాగం, తలసేమియా, సికిల్, డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ దయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో సీఎంఈ నిర్వహించారు. ఇందులో తలసీమియా, హిమోగ్లోబినోపతిస్ అంశాలపై వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు వివరించారు. మల్టీడిసిప్లినరీ, మేనేజ్‌మెంట్, బాధితుల స్క్రీనింగ్, జన్యు నిర్ధారణస్త్ర, నిర్వహణ, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించారు. చాలా మంది బాధితులు తలసీమియాను ఎదుర్కొవడం, చికిత్సలు తీసుకుంటున్న విధానాలను వివరించారు. కార్యక్రమంలో జెనెటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ షగున్ అగర్వాల్, అడినషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, టీఎస్‌సీఎస్ ప్రసిడెంట్ అగర్వాల్, జెనెటిక్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ విజయ లక్ష్మి, డాక్టర్ అశ్విని, తలసీమియా బాధితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంగీత విభావరి


త్యాగరాయ కృతులు ఆలపిస్తున్న కళాకారులు

మాదాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో సంప్రదాయ సంస్థ వారి ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో 'జగదానంద కారక' సద్గురు త్యాగరాజ జయంత్యుత్సవం నిర్వహించారు. శ్రీరామ్ జొన్నలగడ్డ శిష్య బృందం త్యాగరాజ కృతులు, పంచరత్న కీర్తనలు, ఆలపించారు. వీరికి వయోలిన్‌పై వాసు శాస్త్రి, మృదంగంపై కృష్ణ శ్రవణ్, అరవింద్, భార్గవ్, కీబోర్డ్‌పై సుమేధ్ సహకరించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న సంగీత గురువులు, సంగీత ప్రియులు అందరూ ఈ జయంత్యుత్సవంలో పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృదినోత్సవం


సామూహిక సీమంతంలో మహిళలు

సనత్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని సనత్‌నగర్‌లోని శ్రీ మాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మహిళలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. మోడల్ కాలనీలోని సంస్కృతి సామాజిక భవనంలో శ్రీ మాతా సేవాసమితి అధ్యక్షుడు కుసుమ విజయ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 30 మంది పేద మహిళలకు సీమంతం చేశారు. చీర, పసుపు, కుంకుమ, గాజుల, పళ్ల పెట్టి మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి మహిళా పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ హేమలత కోగంటి, హైకోర్టు న్యాయవాది రాజేశ్వరి, అమీర్‌పేట వైద్యాధికారులు స్వప్న, జీహెచ్ఎంసీ అధికారి బుచ్చమ్మ, ఆశావర్కర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించలేదని బెదిరింపులు

బంజారాహిల్స్, మే 4(ఆంధ్రజ్యోతి): సకాలంలో బిల్లులు చెల్లించలేదని ఔషధ డిస్ట్రిబ్యూటర్స్ కొందరూ మహిళ ఇంటి మీదకు వెళ్లి దుర్భాషలాడి, బెదిరింపు ధోరణితో వ్యవహరించారు. జూబ్లీహిల్స్, ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో నివాసముండే బొట్ట సరదాదేవి వీవీస్ డ్రగ్స్, ఫార్మాసిటికల్స్ పేరిట వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీవీఎస్ సప్లయిర్స్‌తోపాటు కొంత మంది డిస్ట్రిబ్యూటర్స్ వద్ద ఔషధాలు కొనుగోలు చేసేవారు. వాటికి సంబంధించి డబ్బు సకాలంలో చెల్లించడంలో బొట్ట సరదాదేవి విఫలమయ్యారు. డబ్బు తిరిగి ఇవ్వాలని జీఆర్ చౌదరి, సురేంద్ర, బాలాజీ తదితరులు ఆమె నివాసానికి వచ్చి హంగామా సృష్టించారు. ఈనెల 3న రాత్రి ఆమె ఇంటికి వెళ్లి ప్రహరీ దూకి లోపలికివచ్చి దుర్భాషలాడారు. ఇంటి చుట్టూ రెండు గంటల పాటు తిరుగుతూ బెదిరింపు ధోరణితో వ్యవహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మానసిక రుగ్మతతో విద్యార్థి ఆత్మహత్య

బంజారాహిల్స్: మానసిక రుగ్మతతో బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నగరానికి చెందిన కుంచల కృష్ణవేణి భర్త మురళీ 2017లో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి కృష్ణవేణి ఇద్దరు కుమారులు మేఘనాథ్, నితిన్‌తో కలిసి జూబ్లీహిల్స్ శ్రవంతినగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. మేఘనాథ్ ఇంటర్ మొదటి సంవత్సరం. తండ్రి చనిపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. పలుమార్లు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించగా ఇటీవలే చికిత్స చేయించారు. ఈనెల 3న మేఘనాథ్ భోజనం ముగించుకొని తన గదికి వెళ్లి పడుకున్నాడు. మరుసటి రోజు పెద్దమ్మ దేవాలయానికి వెళ్లేందుకు తలుపు కొట్టగా తీయలేదు. కిటికిలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఓటు హక్కును వినియోగించుకోవాలి


కార్యక్రమంలో సంజయ్ ఉపాధ్యాయ, తదితరులు

పంజాగుట్ట, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యావంతులు, యువత ఓటింగ్ ప్రక్రియకు దూరం ఉండడం, దేశానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వక్తలు అన్నారు. ప్రజాసామ్య పరిరక్షణకు, బలోపేతానికి ఓటర్ చైతన్యం అవసరమని వారు పేర్కొన్నారు. యువత ఓటింగ్‌లో పాల్గొనేలా చేద్దామని పిలుపునిచ్చారు. వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజేఐ)తెలంగాణ శాఖ, పతంజలి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓటరు చైతన్య కార్యక్రమంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాసామ్య పరిరక్షణకు, బలోపేతానికి ఓటర్ చైతన్యం అవసరమని డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ అన్నారు. ఓటర్లను చైతన్యపరిచి వారు పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకనేలా చూడాల్సిన ఎన్నిక ల కమిషన్ ఆ దిశగా తగినంత కృషి చేయడం లేదన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తే ఎక్కువ మంది ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. అందుకు ఓటర్ గుర్తింపు కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయాలని, ముందుగా బోగస్ ఓట్లను తొలగించాలని సూచించారు. జర్నలిస్టుల సంక్షేమానికి పాటుపడడమే కాకుండా ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. మారాలని ప్రొఫెసర్ మురళీ మనోహర్ మాట్లాడుతూ.. ఓటు వేయడం పట్ల నిరసక్తత, నిర్లిప్తత వదిలిపెట్టాలని, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలన్నారు. ఓటింగ్ అక్షరాస్యత అనేది చాలా ముఖ్యమని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రావు అన్నారు.ఓటు హక్కు తప్పనిసరి విధిగా రాజ్యాంగంలో చేర్చాలని వక్తలు అన్నారు. ఓటు ప్రాముఖ్యత గురించి పాఠశాల విద్యార్థులకు తెలియజెప్పాలని, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఓటుతో మంచి వారిని ఎన్నుకునే బాధ్యత మనదేనని, ఓట్లు అధికశాతం పోలవ్వాలంటే ప్రభుత్వమే ప్రజలకు రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. సెలవుగా భావించకుండా ఓటు వేసిన తర్వాతే ఎక్కడికైనా వెళ్లేందుకు ప్లాన్ చేసుకోవాలి. బూత్ ఎక్కడో తెలిసేలా చర్యలు తీసుకోవాలి. ఓటరు జాబితాలో పేరు లేకున్నా.. తన ఓటు వేరే వారు వేసినా గ్రామీణులు గొడవ చేస్తారు. కానీ అధిక చైతన్యం ఉన్న నగరాల్లో ఆ పరిస్థితి లేదని, ఎన్జీవోలు వారిలో ఆలోచన రేకెత్తించాలన్నారు. ఇలాంటి సమావేశాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్, ప్రొఫెసర్లు కసిరెడ్డి వెంకటరెడ్డి, యూజీసీ పూర్వ సభ్యుడు గోపాల్‌రెడ్డి, డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ముఖ్య సలహాదారు నందనం కృపాకర్, అర్థనీతి ఫౌండేషన్ ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జి లీల, కృష్ణారెడ్డి, అనిల్ దేశాయి, క్రాంతి కుమార్, గోపాలకృష్ణ, రాజారెడ్డి, రామముని, దేవేందర్, మల్లికార్జున్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఖైరతాబాద్‌లో హోమ్ ఓటింగ్

- ఒకే రోజులో ముగించిన అధికారులు


ఖైరతాబాద్ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ చేయిస్తున్న జెడ్‌సీ హేమంత్, డీసీ ప్రశాంతి

ఖైరతాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక హోమ్ ఓటర్లు ఖైరతాబాద్ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఇక్కడ 85 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల్లో 156 మందికి ఇంటి నుంచే ఓటు వేసేందుకు అనుమతిచ్చారు. శనివారం ఒక్కరోజే ఈ నియోజకవర్గంలో 150 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, మరో ఇద్దరు మృతి చెందినట్టు గుర్తించారు. మరో ఇద్దరు విదేశాల్లో ఉన్నారని, ఒకరు ఆస్పత్రిలో ఐసీయూలో ఉన్నారని, మరొకరు చిరునామా మారారని నియోజకవర్గ ఈఆర్‌వో, సర్కిల్ 18 డీసీ ప్రశాంతి తెలిపారు. మొత్తం 12 టీంలతో హోమ్ ఓటింగ్‌ను ఒకే రోజులో పూర్తి చేసిన అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

### అభినందించిన సీనియర్ సిటిజన్లు..

గతంలో ఐఏఎస్ అధికారులుగా చెలామణి అయి ఎన్నికల విధుల్లో చురుకుగా పాల్గొన్న తమ పెద్దలకు ప్రస్తుతం వారి ఓట్లను ఇంటికి వచ్చి తీసుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని పలువురు విశ్రాంత ఉన్నతాధికారుల పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు. ఇందులో మాజీ ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ కుటుంబీకులు, పలువురు ఐఏఎస్ అధికారుల పిల్లలు ఉన్నారు. చేతి వేలికి సిరా చుక్కతో సీనియర్ సిటిజన్లు సంతోషం వ్యక్తం చేశారు.

### చేరుకున్న అదనపు బ్యాలెట్ యూనిట్లు..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు అదనపు బ్యాలెట్ యూనిట్లు చేరుకున్నాయి. భారీ బందోబస్తు మధ్య వాటిని అధికారులు డీఆర్‌సీ సెంటర్‌లో భద్రపరిచారు. ఈసారి మూడు ఈవీఎం యంత్రాలను వాడాల్సిన అవసరం ఏర్పడడంతో బ్యాలెట్ యూనిట్లను అదనంగా సమకూర్చాల్సి వచ్చింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో అదనంగా 613 బ్యాలెట్ యూనిట్లు వచ్చాయి.

### ఓటు హక్కుపై అవగాహన

ఖైరతబాద్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తూ సైఫాబాద్ పీజీ కళాశాల ఎన్‌సీసీ కెడెట్లు నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్ మార్గాల్లో ర్యాలీ నిర్వహించి ఇందిరా గాంధీ కూడలిలో ప్రదర్శన నిర్వహించారు.

# సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం

● సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

**ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):** అన్ని వర్గాల ప్రజల అండదండలతో సికింద్రాబాద్ ఎంపీగా విజయం సాధిస్తానని పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, మాజీ వార్డుమెంబర్ జ్యోతితోపాటు 50 మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి దానం నాగేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథ్, చంద్రకళ, లక్ష్మీబాయి, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

### ముషీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో

**ముషీరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా శనివారం సాయంత్రం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముషీరాబాద్ చౌరస్తాలో ఇరువైపుల జనంతో కిక్కిరిసిపోయింది. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు సికింద్రాబాద్ అభ్యర్థి దానం నాగేందర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, హజారొద్దీన్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దానం నాగేందర్‌ను గెలిపిస్తే కేంద్ర మంత్రిని చేసే బాధ్యత నాదే అని అన్నారు. లక్ష మెజార్టీతో దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు.



దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్ యాదవ్, జ్యోతి తదితరులు



ముషీరాబాద్ చౌరస్తాలో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

### దానంను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

**చిక్కడపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి):** దానం నాగేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తున్నామని గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ తెలిపారు. శనివారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాదయాత్రలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, కెన్నడీ రాజు, జయేందర్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, యాదగిరిగౌడ్, జానకి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న అభిషేక్ కెన్నడీ తదితరులు

### అడిక్‌మెట్, రాంనగర్ ప్రాంతాల్లో...

**రాంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే దానం నాగేందర్‌ను ప్రజలు గెలిపించాలని ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.అరవింద్‌కుమార్ యాదవ్ కోరారు. శనివారం సాయంత్రం దానం నాగేందర్‌కు మద్దతుగా అడిక్‌మెట్, రాంనగర్ ప్రాంతాల్లో మాస్ పాదయాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే అయిదు గ్యారంటీలను అమలు చేశారని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. బీజేపీ, బీఆర్ఎస్ మోసకారి మాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలు గౌరీశంకర్, పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్, నాయకులు తిరుమల్, మనోహర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అడిక్‌మెట్‌లో ప్రచారం చేస్తున్న ఎన్నికల ఇన్‌చార్జిలు అరవింద్‌కుమార్‌యాదవ్, కె.గౌరీశంకర్ తదితరులు

ప్రజారంజకపాలనను అందించడంలో ..

# బీజేపీ,కాంగ్రెస్‌లు విఫలం

● పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):** ప్రజారంజకమైన పరిపాలనను అందించడంలో విఫలమైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వాలను ప్రశ్నించేందుకు బీఆర్ఎస్‌కు పార్లమెంట్‌లో చోటుకల్పించాలని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలోని బాపూజీనగర్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల్లో పద్మారావుగౌడ్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్, మాజీ శాసనసభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, యువనేతలు ముఠా జైసింహ, రామేశ్వర్‌గౌడ్ తదితర నాయకులతో కలిసి పద్మారావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వం వివిధ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిందని, వాటి అమలును విస్మరించారని విమర్శించారు. బీజేపీ నాయకులు మతతత్వ రాజకీయాలతో ప్రజలను విభజిస్తున్నారని ఆరోపించారు.

ఈ రెండు పార్టీలను ప్రజలు ఎన్నికల్లో తిప్పికొట్టాలని, తనను సికింద్రాబాద్ ఎంపీగా గెలిపిస్తే ప్రజలకు సేవలందిస్తానని హామీ ఇచ్చారు. ముఠాగోపాల్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్



తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న పద్మారావుగౌడ్

### క్రైస్తవులను రక్షించే చట్టాలు లేవు

**రెజిమెంటల్‌బజార్, మే 4 (ఆంధ్రజ్యోతి):** క్రైస్తవులను రక్షించే చట్టాలు లేకపోవడంతో మతోన్మాదులు రెచ్చిపోతు, దాడులకు పాల్పడుతున్నారని క్రైస్తవ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీ.వీ. యోహన్ అన్నారు. దన్వాడ సంఘటన మరవకముందే రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లో క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నారని క్రైస్తవ సువార్తికులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. రౌడీషీట్ తెరిచి, రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ పీపీ బెనర్జి, ప్రేమ్ హేబ్రాన్, అర్మ్‌స్ట్రాంగ్ పాల్గొన్నారు.

గల్లీలో ఎవరున్నా..

# ఢిల్లీలో మోదీ ప్రధానిగా ఉండాలి

● మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్

**కూకట్‌పల్లి జోన్‌బృందం, మే 4 (ఆంధ్రజ్యోతి):** గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాలని మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్‌లోని అయోధ్యనగర్, కుత్బుల్లాపూర్, భూమిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ప్రచారం చేశారు. ప్రజలు మంగళహారతులతో ఈటల రాజేందర్‌కు ఎదురువచ్చి ఆశీర్వదించారు. ఈటల మాట్లాడుతూ.. సైనికులకు మోదీ అండగా నిలబడి దేశ విదేశాల్లో వారి కీర్తిప్రతిష్టలను పెంపొందించారన్నారు. మన నేవీ ఉద్యోగులకు పరాయి దేశంలో ఉరిశిక్ష పడితే, ఆ దేశాల అధ్యక్షులతో మాట్లాడి దాన్ని రద్దు చేయించారన్నారు. దేశంలో ప్రతిష్టాత్మక ఎయిమ్స్ ఆస్పత్రుల్లో మోదీ ప్రధాని కాకముందు మూడే ఉండేవని, ప్రస్తుతం పదిహేడుకు చేరాయన్నారు. కరోనా సమయంలో అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉంటే, మన దేశం మాత్రం కరోనాను తట్టుకొని 11వ స్థానం నుంచి 5వ ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని, దీనికి ప్రధాని మోదీ తీసుకున్న గొప్ప నిర్ణయాలే కారణమన్నారు. ప్రజలు ఆకలితో ఉండకూడదని. ప్రతీపేద వారికి ఒక్కొక్కరికి 5కిలోల చొప్పున రేషన్ బియ్యం అందజేశారు. తెలంగాణాలో కాంగ్రెస్‌ను గెలిపించి, ఎంపీలను పార్లమెంట్‌కు పంపిస్తే ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రధాని అయితే లంకెబిందెలు ఇస్తాడని, అప్పుడు తెలంగాణ ప్రజలకు చెప్పిన హామీలను నెరవేరుస్తామని రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు. ఇది సాధ్యమయ్యే పనా అని మండిపడ్డారు. కొంపల్లి వైపు మెట్రోరైలు తీసుకురావాలనే ఉద్దేశంతో ఉన్నామని, మల్కాజిగిరిలో ఎలాంటి అభివృద్ధి జరగాలన్నా మేము పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, భరత్‌సింహారెడ్డి, బక్క శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గిరివర్ధన్‌రెడ్డి, శేఖర్‌యాదవ్, వెంకట్ రెడ్డి, పులి బలరామ్, సందీప్‌గౌడ్, ప్రతాప్, మహిళా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటల రాజేందర్



ఈటల రాజేందర్‌ను మంగళహారతితో ఆశీర్వదిస్తున్న మహిళ



ప్రచారం చేస్తున్న ఈటల జమున, కార్పొరేటర్ చేతన తదితరులు

### ఈటల జమున ప్రచారం

**రామంతాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి):** హబ్సిగూడ డివిజన్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల వద్దగల గేటెడ్ కమ్యూనిటీ గంగా, యమునా, సరస్వతి అపార్టుమెంట్‌ల నివాసితులతో బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి ఈటల రాజేందర్ సతీమణి జమున, కార్పొరేటర్ చేతనా హరీష్‌లు శనివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమలం గుర్తుపై ఓటును వేసి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో అపార్టుమెంట్‌ల నివాసితులతో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# అందరికీ అందుబాటులో ఉంటా.. గెలిపించండి

● మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న వివేకానంద్, పక్కన కేటీఆర్, రాగిడి

**జీడిమెట్ల, మే 4 (ఆంధ్రజ్యోతి):** తాను లోకల్ అని, బీజేపీ అభ్యర్థి హుజురాబాద్ నుంచి, కాంగ్రెస్ అభ్యర్థి తాండూరు నుంచి వచ్చారని, ప్రజలు ఆలోచించి అందరికీ అందుబాటులో ఉండే నాకు ఓట్లు వేసి గెలిపించాలని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కోరారు. శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎన్నికల రోడ్‌షో షాపూర్‌నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నానని, ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్‌లు మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బాలరాజుయాదవ్ పాల్గొన్నారు.

### రాగిడిని గెలిపించాలి

**అల్వాల్, మే 4 (ఆంధ్రజ్యోతి):** మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా శనివారం నిర్వహించిన బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి లోక్‌సభకు పంపించాలనే ఉద్దేశ్యంతో ఉన్నారన్నారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. బూత్ లెవల్లో కార్యకర్తలను సమన్వయపరిచి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి మల్లేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో నిర్వహించిన బూత్‌లెవల్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



రామంతాపూర్‌లో ప్రచారం చేస్తున్న ముస్లిం నాయకులు

# నన్ను ఆశీర్వదించండి.. అసెంబ్లీకి పంపండి

● బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

**తిరుమలగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి):** నన్ను ఆశీర్వదించండి.. అసెంబ్లీకి పంపండి.. నాన్న లాగా అభివృద్ధి చేసి చూపిస్తా అంటూ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత తిరుమలగిరిలోని బోరా ముస్లిం కమ్యూనిటీ సభ్యులను కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డ్ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో కలిసి విన్నవించారు. తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆమెకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో షకీల్, యూసఫ్ రుక్మయ్యలు పాల్గొన్నారు.

**బోయినపల్లి :** తన తండ్రి, చెల్లి ఆశయాలను పూర్తి చేయడానికి తనను దీవించి గెలిపించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత మహిళలకు విజ్ఞప్తి చేశారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక నేపథ్యంలో శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గం 6వ వార్డు పరిధిలో స్థానిక బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ఆధ్వర్యంలో ఉపఎన్నికల బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమూల్యమైన ఓటు కారు గుర్తుకు వేసి గెలిపించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక కాలనీల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



బోరా ముస్లిం కమ్యూనిటీ సభ్యులతో నివేదిత



కంటోన్మెంట్ ఆరవ వార్డు పరిధిలోని కార్తీక్ ఎన్‌క్లేవ్ ఎన్నికల ప్రచారంలో మహిళల దీవెనలు అడుగుతున్న నివేదిత

# గెలిపిస్తే సేవకుడిలా పనిచేస్తా

● కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్

**మారేడుపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి):** ప్రజలు కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నారని కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీగణేష్ అన్నారు. శనివారం వాల్మీకినగర్, మహాత్మాగాంధీ నగర్, లక్ష్మీనగర్, పికెట్ బస్తీలలో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతారెడ్డితో కలిసి ఆయన రోడ్ షో ఎన్నికల ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకే ఓటు వేసి తనను, సునీతారెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.... ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే నాయకుడిలా కాకుండా, సేవకుడిలా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకం అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యకరంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పెద్దాల నరసింహయాదవ్, సంకీ రవీందర్, తేలుకుంట సతీష్‌గుప్తా, ఎస్.వెంకటేష్, బద్రీనాథ్ యాదవ్, అశోక్, సంజీవ్, నర్సింగ్ యాదవ్, శివ, సత్యనారాయణ, శివ కుమార్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకినగర్‌లో ఎన్నికల ప్రచారంలో మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా రెడ్డి, శ్రీగణేష్



తిరుమలగిరిలోని చిన్నమ్మ తోటలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్న అభ్యర్థి శ్రీగణేష్



సర్వే ఇంట్లో సమావేశంలో మాట్లాడుతున్న సునీత

### కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేస్తా : సునీత

**మారెడ్‌పల్లి మే 4 (ఆంధ్రజ్యోతి) :** ఓటర్లు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపిస్తే తాను నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తూ సమస్యలను తీరుస్తానని, నిత్యం అందుబాటులో ఉంటానని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యురాలుగా పోటీ చేస్తున్న సునీత మహేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కంటోన్మెంట్ నియోజకవర్గం మహేంద్ర హిల్స్‌లో మాజీ మంత్రి సర్వేసత్యనారాయణ నివాసంలో జరిగిన కార్యకర్తలు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ సంజీవ రెడ్డి, మైనారిటీ నాయకుడు అయుబ్ ఖాన్ తదితరులు మాట్లాడారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, బాల్‌రాజ్‌లు పాల్గొన్నారు.

జింఖానా మైదానంలో ..

# ఆకట్టుకుంటున్న బాంబే సర్కస్



గ్రేట్ బాంబే సర్కస్‌లో విన్యాసాలు




గ్రేట్ బాంబే సర్కస్‌కు విచ్చేసిన సందర్శకులు

**సికింద్రాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ జింఖానా మైదానంలో గ్రేట్ బాంబే సర్కస్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మండుటెండలకు అతలాకుతలమవుతున్న ఆబాలగోపాలం సాయంత్రంపూట బాంబే సర్కస్‌కు తరలివస్తూ, తనివితీరా సేద తీరుతున్నారు. శనివారం సందర్శకులతో జింఖాన మైదానం కిటకిటలాడింది.

**సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపును కోరుతూ శనివారం అడ్డగుట్ట డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి కిషన్‌రెడ్డికి ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు సీ.హెచ్.సంధ్య, ఎం.భాగ్యలక్ష్మి, బి.జ్యోతి, శిరీష**

- అడ్డగుట్ట,ఆంధ్రజ్యోతి



# బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో బ్యాగు కలకలం

### ప్రయాణికుడిదిగా గుర్తింపు

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి):** బేగంపేట్ రైల్వే స్టేషన్‌లో ఓ బ్యాగు కలకలం రేపింది. బేగంపేట్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం బేగంపేట్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1పై ఓ పక్కన అనుమానస్పద స్థితిలో బ్యాగు ఉందని సమాచారం అందుకుని, ఘటనా స్థలానికి వెళ్లి బ్యాగును స్వాధీనం చేసుకున్నామన్నారు. అందులో పెళ్లి బట్టలు, పిల్లలు బట్టలు ఉండడంతో ఆర్పీఎఫ్ పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కాసేపటి తరువాత బ్యాగు కోసం వాకబు చేస్తున్న లింగంపల్లికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి కనిపించడంతో ఆ బ్యాగును అతనికి అప్పగించారు. ఇలా ఎక్కడ పడితే అక్కడ బ్యాగులు వదిలేయకూడదని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఆ బ్యాగులో రూ.25వేలు విలువ చేసే బట్టలు ఉన్నాయని సీఐ తెలిపారు



బ్యాగును స్వాధీనం చేసుకున్న ఆర్పీఎఫ్ సీఐ నసీమా

### ఒంటరి మహిళలు, వృద్ధులే టార్గెట్‌గా చోరీలు .. ఇద్దరి అరెస్టు

**బోయినపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి):** ఒంటరిగా వెళుతున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను బోయినపల్లి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యబస్తీ హస్మత్‌పేట్‌కు చెందిన రంజిత్‌సింగ్ (24), చిత్తారి భరత్ (20) తన సోదరుడు శ్రీను కలిసి నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ వారి చేతుల్లోని వస్తువులు, సెల్‌ఫోన్లు తస్కరిస్తూ తప్పించుకు తిరుగుతున్నారు. శనివారం నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్టు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్ తెలిపారు. కాగా రంజిత్‌సింగ్‌పై అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచి, రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.



గోమాతను రక్షించాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీ కళాపీఠం వ్యవస్థాపకురాలు కరాటే కల్యాణి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

### సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

● జీఆర్పీ పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

**సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 4 (ఆంధ్రజ్యోతి) :** రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో రవాణా అవుతున్న 34కిలోల గంజాయి సరుకును సికింద్రాబాద్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సౌత్ ఢిల్లీకి చెందిన వికాస్, ఆకాశ్ కుమార్‌లు కలిసి విశాఖపట్నం నుంచి వయా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీకి 34 కిలోల పొడి గంజాయి సరుకును రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే ఎస్పీ సలీమా, డీఎస్పీ వజీద్‌ల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేసన్‌లో రైల్వే పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ సమయంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలులో ఎస్సై రమేష్, కానిస్టేబుళ్లు కోటేశ్వర్‌రావు, హరిలాల్, భవాని శంకర్, చంద్రశేఖర్‌లు కలిసి తనిఖీలు చేపట్టారు. రైలులో రూ.8.50లక్షల విలువ చేసే గంజాయి సరుకు ఉన్నట్లు తెలిసింది. వెంటనే వికాశ్, ఆకాశ్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.